# కెరటాలు

సాయంత్రం నుంచీ వాన కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. పాపాయి వరండాలో కూర్చుని కాగితం పడవలను నీళ్ళలో వదిలి ఎంతోసేపు ఆడుకుంది. శంకరి లోపలికి వెళ్ళగా చూచి వాకిట్లోకి వెళ్ళి ఇసుకలో, వాననీళ్ళలో కాళ్ళు తడుపుకుని ఆడుకుంది. మళ్ళీ శంకరి యివతలకు రాగానే తప్పుచేసిన దానిలా మెల్లిగా లోపలికి వచ్చేసింది. దాని బట్టలు మార్చి తలదువ్వి, పౌడరువేసి బొమ్మలా చేసి కూర్చోపెట్టింది శంకరి. అది బుద్ధిగా కూర్చోలేదు. లోపలికి వెళ్ళి బొమ్మలు తెచ్చుకుంటానంది. తెచ్చుకుంది.

అది బొమ్మలన్నీ తీసి ఆడుకుంటూ శంకరిని అడిగే ప్రశ్నలకు అంతులేదు. "అమ్మా—నా బొమ్మని వానలో పంపకూడదా?" అంటుంది.

"పంపకూడదమ్మా—దానికి ఉవ్వాయి వస్తుంది."

"రానీ—మందేద్దాం" అంటుంది.

ఎంత మొండిపిల్ల! అంతా ఆ తండ్రిపోలికే! శంకరికి మనస్సులో చెప్పలేని భారము అలముకొన్నది. కళ్ళలో నీళ్ళుకూడా రానంత పెద్ద బండరాయివంటి భారము అది. మనిషిని ఎటూ కదలనివ్వక, ఆలోచన తోచనివ్వకుండా చేసే బరువు అది. పాపకు నాన్నమీద బెంగ యిప్పుడే తగ్గుతోంది. అన్నిసార్లు అడగటంలేదు నాన్నకోసం. కానీ దాని ముఖంలోకి చూస్తోంటే తనకే ఎన్నో జ్ఞాపకాలు తెరలు తెరలుగా వచ్చి, వూపిరి ఆడనివ్వకుండా చేస్తాయి. మరుక్షణం

ఆ జ్ఞాపకాలన్నీ మాయమై ఒక పెద్ద నల్లని తెర పడుతుంది కళ్ళ ముందు, మనస్సుమీద.

వాకిట్లో రిక్షావచ్చి నిలబడింది. రెయిన్ కోటు పుచ్చుకొని దిగాడు మరిది. శంకరి లేచి లోపలికి వెడుతూ హాల్లో కూర్చున్న చెల్లెలు లలితకి చెప్పింది—"మరిదిగారు వచ్చారు" అని. అది పత్రిక చదువుకుంటోంది. విన్నదో లేదో కూడా తెలియలేదు. శంకరి లోపలి గదిలోకి వెళ్ళి బట్టలు మడతలు పెడుతోంది. ఆయన బూట్ల చప్పుడు, లోపలికి రావడం, లలితని పలకరించడం వినబడింది. ఒక్క నిముష మాగి ఆయన రెయిన్‌కోటు విప్పుతూ గదిలోకి అడుగు పెట్టాడు. వదినగారిని చూచి ఆగి, మళ్ళీ వెనక్కి తిరిగి వెళ్ళాడు. శంకరి గది లోంచి యివతలికి వచ్చి వంటింటివేపు వెళ్ళింది,

కాస్సేపటికి లలిత ఒక చేత్తో పత్రిక పుచ్చుకొని చదువుతూ, నడుస్తూ వచ్చింది వంటింట్లోకి. "స్టవ్ ఖాళీగా వున్నదా?" అనడి గింది. శంకరి తలూపింది. "అంటించనా?" అన్నది.

"అంటించి—కాసిని నీళ్లు పడేయి. ఏడు కావస్తున్నా మనింట్లో యీ మేళం తప్పదు." అన్నది విసుగ్గా. పత్రిక గుమ్మంమీద పడేసి కాఫీపొడి డబ్బా, పంచదార సీసా తీసింది అలమారలోంచి.

అమ్మ వచ్చింది వంటింట్లోకి. లలిత కాఫీ చేయడం చూసింది. "ఇప్పుడే కాఫీ ఏమిటే—మరీ పిచ్చ. ఇంక ఆకలి వుండాలా అన్నం తినాలంటే?" అన్నది.

"ఏమో—ఎవరికి చెప్పమంటావు - ఎంత కోపమో మనిషికి మరి. రోజంతా చాకిరీ చేసివుంటారు కదా! రాగానే ఎందుకులే పాపి

చెప్పడం అని అనుకోరు. ఇవతలవాళ్ళూ మనుష్యులేగా. అది సరే. నీ సుపుత్రుడు రాడూ కాస్సేపటికి?" అన్నది లలిత.

"ఇంకో చెంచాడు పొడుం వేయి వాడికి కూడా. లేకపోతే మీ వదిన మళ్ళీ ఏంచేస్తుంది?" అన్నది అమ్మ.

శంకరిని చూసి, "తలనొప్పి వచ్చిందా శంకరీ! అల్లా వున్నావు?" అన్నది. శంకరి అడ్డంగా తలూపింది. "పాప పిలుస్తోంది, వెళ్ళు. నేను మిగతా పని చూసుకుంటాను." అన్నది లలిత.

తనచేత ఏపనీ చేయించరు యింట్లో యీ ఆరు నెలలనుంచీ. అన్నయ్య వాళ్ళకి మంచి యిల్లు యిచ్చారు గవర్నమెంటువాళ్ళు. దానిలోకి వాళ్ళు ప్రవేశించిన రెండు నెలలకే లలిత వాళ్ళాయనకు కూడా ట్రాన్స్ఫరై వచ్చారు. వాళ్ళకి వేరే యిల్లు దొరకడం కష్టమైంది. అదీకాక అన్నయ్యవాళ్ళ యిల్లు పెద్దది. అందువల్ల వాళ్ళ సంసారం కూడా యిక్కడే ఉంది. అంత కలిసి వున్నాముకదా. నాల్గు రోజులు వచ్చి వుండమని వ్రాసింది లలిత శంకరికి. శంకరి, పాపాయి సరిగ్గా ఏడు నెలల క్రితం వచ్చారు—ఆయనే తీసుకొచ్చి దిగబెట్టారు.

మళ్ళీ తీసుకుపోవడానికి వస్తానన్నారు. అంతగా తనకి అక్కడ అవసరమైతే ఉత్తరం వ్రాస్తానన్నారు. ఒక్కరూ భోజనానికి ఏమి తిప్పలు పడతారు, వచ్చేస్తానని శంకరి వ్రాస్తే, మళ్ళీ ఎప్పుడుంటావు అందరితో కలిసి, ఉండిరా అని జవాబు వ్రాశారు. దిగబెట్టి వెళ్ళిన మనిషి మళ్ళీ తనని తీసుకు వెళ్ళడానికి తిరిగి రానేలేదు. మళ్ళీ ఎన్ని

టికీ ఆయన తిరిగి రాకుండానే, తను ఎన్నటికీ మళ్ళీ తన యింటికి పోకుండానే చేశాడు భగవంతుడు.

ఆరు నెలల క్రితం ఆరోజు ప్రొద్దున్నే ముఖం కడుక్కుంటోంటే నాన్నగారు వీధివేపు వెళ్ళారు ఎవరో కేకవేస్తే. తిరిగి టెలిగ్రాం చేత్తో పుచ్చుకుని యింట్లోకి వచ్చిన ఆయన ముఖం ఎంత భయంకరంగా వుందో అప్పుడు గుర్తించలేదు శంకరి. "శంకరి ఏదీ ?" అని గ్రుడ్డివాడిలా తడుముకుంటున్న ఆయన్ని చూసి బెంబేలు పడ్డారు అందరూ. పాపని దగ్గరకు లాక్కుని అమ్మ ఏడుస్తోంటే, తనని కావిలించుకుని లలిత బావురుమంటుంటే శంకరి ఏమిటోగా చూసిందే కానీ - తన బ్రతుకు ఎంత అధ్వాన్నమైపోయిందో వెంటనే గ్రహించుకోలేక పోయింది.

"అయ్యో పాపం !" అన్నారు అందరూ. పాపని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నిద్రపోతున్నట్లున్న ఆయన్ని చూస్తే - ఎందుకంత హఠాత్తుగా చెప్పకుండా వెళ్ళిపోయారని కదిపి అడగాలని యత్నం. ఒక్కసారి వెడుతున్నానని చెప్పమని తల బద్దలుకొట్టుకొని బిగ్గరగా ఏడ్చింది శంకరి. తను ఎవరికి ఏమి అన్యాయం చేసిందని భగవంతుడు యింత శిక్ష వ్రాసిపెట్టాడు ? కలలాగా కరిగిపోయాయి ఆ అయిదేళ్ళు. పెనవేసుకొన్న తీగెల్లాగావున్న బ్రతుకులను హఠాత్తుగా త్రెంపివేసింది మృత్యువు. తన ప్రతి ఆలోచనలో, కదలికలో, కోరికలో, ప్రార్థనలో, పూజలలో అన్నిటిలో కలిసిపోయి, అన్నిటికీ ఆలంబనగా నిలచిన ఆ మూర్తి ఒక్క సారిగా శిలగా మారిపోతే ఏమి కావాలి తను ?

పాపను గుండెలకు హత్తుకొని, నిద్రపట్టని అర్ధరాత్రులు చీకట్లోకి చూస్తూ గడిపింది. ఎన్నో రోజులు తలుపుతట్టి ఆయన

పిలుస్తారని, ఏడుస్తున్న తన తలమీద చల్లగా చేయివుంచి ఓదారుస్తారని ఏదో వెర్రి ఆలోచన. అది నిజం కాదని చటుక్కున తెలుస్తోంటే గుండెలు పగిలిపోయేవి. 'నేనూ వస్తా, నేనూ వస్తా' అని బిగ్గరగా అరుస్తూ ఏడ్చింది తను. రారమ్మని పిలుపే వినబడలేదు. ఇదుగో, వద్దువుగాని అన్న అనునయింపే కనబడలేదు. ఎంత మౌనంగా, పలుకకుండా అయిపోయినారాయన.

పాప పరుగెత్తుకుని వచ్చింది "అమ్మా, అమ్మా" అని పిలుస్తూ. కళ్ళు తుడుచుకుని లేచి కూర్చుంది శంకరి. "అమ్మా, చూడు" అంటూ రంగుల బొమ్మ వున్న చాక్లెటు డబ్బా చూపిస్తోంది పాప. "మామయ్య తెచ్చాడు" అంటోందది మెరుస్తున్న కళ్ళతో.

వాసుకూడా దాని వెనకాలే వచ్చాడు. "ఏయ్, పాపా, ఇల్లా గియ్యి. అమ్మమ్మకోసం తెచ్చాను. నీకోసంకాదు." అంటున్నాడు వేళాకోళానికి. పాప శంకరిని పట్టుకుని ఏడుపుముఖం పెట్టింది.

"ఏం శంకరీ! తలనొప్పిగావుందా పడుకున్నావు? హాల్లోకిరా, నేను కాఫీ తాగివస్తాను. కాస్సేపు రమ్మీ వేద్దాం" అన్నాడు. పాపను బలవంతాన ఎత్తుకొని బయటకు తీసుకు వెళ్లాడు వాసు.

శంకరి కాస్సేపటికి లేచింది. హాల్లోకి వెళ్ళబోయి వెనక్కి తిరిగింది. కుర్చీలో శాంత కూర్చునివుంది, వాసు ఆమె మీదకు వంగి ఏమిటో చెబుతున్నాడు. బ్రతిమాలుతున్నాడు. కాస్సేపటికి వాసు అవతలికి వెళ్లిన అలికిడైనాక శంకరి యివతలికి వచ్చింది. శాంత అల్లాగే కూర్చునివుంది. ముఖం ఎర్రగావుంది — ఏడ్చినట్లు. సాయంత్రం నుంచి సినిమాకు వెడదామని తయారైంది వదిన. అన్నయ్య ఎప్పటికీ రాకపోతే ఆమెకి కోపమొచ్చింది.

గుమ్మంలో వాసు రెండుచేతుల్లో రెండు కాఫీ గ్లాసులు పుచ్చుకొని ఎదురైనాడు.

"ఇలాగియ్యి అన్నయ్యా! నువ్వెందుకు మోసుకొస్తావు? నేను తెచ్చిపెడతా." అన్నది శంకరి అన్నయ్యంటే జాలిపడి.

"వద్దు - రాణీగారికి నువ్విస్తే పనికిరాదు" అన్నాడు.

నిజంగానే శాంతకి అంత కోపంగానూవుంది. "నాకేమీ అఖ్ఖర్లేదు కాఫీ, మీరు త్రాగండి, నన్నిట్లా బ్రతకనివ్వండి" అన్నదామె తీవ్రంగా.

"ఇశ్శో! ఏమిటా దూకుడు? ఒక్కపూట సినిమాకి ఆలస్యమైతే ప్రళయం వచ్చినట్లు మాట్లాడుతావేమిటి?" అన్నాడు వాసు.

"ప్రళయం వచ్చినా బాగుండును. నేను శుభ్రంగా కొట్టుకు పోతాను, పీడా పోతుంది. ఎంతసేపూ ఆఫీసులో ఏమి కోతులాట వుంటుందో అక్కడే అతుక్కుపోతారు. ఒక్కసారైనా పెందరాళే రావాలనిలేదు చెప్పిన ప్రకారం. నాకు తెలుసులెండి - ఇంటికొస్తే నా జిడ్డుమొహం చూడాలిసి వస్తుందని" ఏమిటేమిటో అంటోంది శాంత.

"నీకు శాంతని ఎవరు పెట్టారే పేరు?" అని వాసు అంటే ఆమె చేతులోవున్న న్యూస్ పేపరు క్రిందపారేసి విసవిస నడిచి వెళ్ళింది లోపలికి.

ఆరాత్రి ఆ యింట్లో ఎక్కడా అలికిడిలేదు, పాప మాటలు మినహా. శంకరి రాత్రి పడుకోబోయేముందు హాల్లోకి వచ్చి చూచే

సరికి అన్నయ్య న్యూస్ పేపర్ ముఖంమీద పెట్టుకుని, పడక్కుర్చీలో పడుకుని వున్నాడు.

ఎంత అశాంతి జీవితంలో—యిందాక లలితా అంతే. ఏదో విసుక్కుంటుంది. చిన్నచిన్న విషయాలకి ఎందుకింత కలతపడతారు వీళ్ళనిపించింది శంకరికి. గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుంటే, ఏదో విపరీతమైన బాధ వచ్చింది కడుపులో. పెద్ద గునపముతో పొడిచినట్లు ఒక్కసారి పోటు వస్తుంది గుండెల్లో. ఎప్పుడు మాని పోతుంది యీ బాధ!

నూరేళ్ళపంట యీ బ్రతుకు. ప్రతిక్షణం ఏదో అందం కల్పించాడు భగవంతుడు. కానీ ఒక్కక్షణం రెప్పవేస్తే అన్నీ మాయమై శూన్యం మిగులుతుంది అనిపిస్తుంది ఒక్కోసారి.

చెల్లెలిని, మరిదిని చూస్తోంటే, అన్నయ్యని, వదినని చూస్తోంటే ఏవో ఆలోచనలు వస్తున్నాయి శంకరికి. తనకి వాళ్ళనిచూస్తే బాధ కలుగుతోందా?—లేదు, నిజంగా లేదు. ఎంత అందమైన బంధనం దాంపత్యం! సెలయేరులాంటి యీ జీవితం పూలు, మొక్కలు, గడ్డి పోచలమీదనుంచి దూసుకొని పోతుంది. అదంతా ఒక్కసారి యింకి పోయి, చారికలు చారికలుగావున్న ఎడారి యిసుక బయలుపడితే—ఏమి చేయాలి?

ఎంత తెలివితక్కువన పడుతున్నారు వీళ్ళు—తనకి రాకూడని ఆలోచనలు వస్తున్నాయా వాళ్ళని చూస్తోంటే?—లేదు. భగవంతుడు అందరంటేనూ నిర్దయగా వుండడు. కానీ— "జాగ్రత్తగా వుండండి. మెత్తని పట్టుకుచ్చులాంటి యీ బంధనం మీ మనస్సులవి

పెనవేస్తోంది—దీన్ని బిగించండి, వదులు కానివ్వకండి" అని వీపు మీద నిమిరి చెప్పాలనిపిస్తుంది. "విరబూచి వాసనలు చిమ్మే పూలతో నిండిన మల్లెలగుబురు యీ సంసారం. దీన్ని గట్టిగా కుదపకండి, పూలు రాలిపోతాయి. గుబురే కదిలిపోతుంది" అని భయం చెప్పా లనిపిస్తోంది. ఏమి చెప్పగలదు తను—ఎలా చెప్పగలదు ?

మళ్ళీ తెల్లవారింది. రాత్రి కురిసిన వాన, రాత్రి భయపెట్టిన చీకటి ఏమైపోయినాయి! నారింజరంగుగా వుండే కాంతి చెట్లమీద పడుతోంది. కళ్ళు తెరిచిన శంకరికి మరిది, చెల్లెలు, అన్న, వదిన కలిసి బిగ్గరగా నవ్వుకుంటున్న నవ్వులు తెంలు తెరలుగా వినబడు తున్నాయి.

ఉవ్వెత్తున లేచే కెరటం ఉన్నతంగా కనిపిస్తుంది. అదే మళ్ళీ క్రిందికి లోతుగా దించుకుపోతుంది. ఆ అల మళ్లి పైకిలేస్తుంది. ఇలా అలలుగా ఎత్తు పల్లాలుగా వున్న జీవితం ఒడ్డుచేరే సమయానికి పెద్ద శబ్దంతో విరిగిపోతుంది. అక్కడితో ఆ కెరటం జీవితం సమాప్తం.

---